సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 20 । జనవరి । 2024



ప్రారంభించారు.. వదిలేశారు
నాలుగు నెలల క్రితం ఆర్భాటంగా ప్రారంభించిన పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయాలు నేటికీ తెరుచుకోవడంలేదు. 8లో



ఉత్సాహంగా కథా కార్యశాల
విద్యార్థుల్లో రచనలపై ఆసక్తి పెంపొందించేందుకు బాలోత్సవ్ ఆధ్వర్యాన కొత్తగూడెంలో కార్యశాల నిర్వహిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం
జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో మాత్రం చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్వర్ణకవచాలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)అమ్మవారికి శుక్రవారం పంచామృతంతో వైభవంగా అభిషేకం చేశారు. మొదట అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు జరిపించారు. ఆ తర్వాత కుంకుమ పూజ, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ ప్రతిభ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను ఖమ్మం ప్రతిభ జూనియర్ కళాశాల, సీఓఈ దమ్మపేట, సీఓఈ కిన్నెరసాని కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మాత్రమే ఫిబ్రవరి 5 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, అందరికీ ఒకే చోట లెవల్ -1 ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 18న, లెవల్ -2 పరీక్ష మార్చి 10న నిర్వహిస్తామని తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్‌కు అవసరమైన ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్ అందజేస్తామని పేర్కొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఓటరు నమోదుతో పాటు సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 8 వరకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహిస్తామని అన్నారు. ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగుల ఓటుహక్కు నమోదుపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పొరపాట్లకు తావులేకుండా జాబితా రూపొందించేందుకు బూత్‌స్థాయి అధికారులు గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు ప్రతీక్‌జైన్, డాక్టర్ రాంబాబు, శిరీష, మంగీలాల్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కార్యదర్శులకు నోటీసులు

చుంచుపల్లి: గతంలో విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో పంచాయతీ కార్యదర్శులు రేష్మా బేగం, వంశీకృష్ణపై ఉన్నతాధికారులు విచారణ జరిపారు. అనంతరం వారిపై చర్యలు తీసుకొని స్థానచలనం కల్పించారు. 8 నెలల అనంతరం నివేదికల ఆధారంగా కలెక్టర్ ప్రియాంక అల మొదటి తప్పుగా భావిస్తూ శుక్రవారం నోటీసులు జారీ చేశారు.

సీతారామ ప్రాజెక్ట్



ఇల్లెందుకు నీరందేనా?

సీతారామ ప్రాజెక్ట్‌లో పలు మార్పులు
- రూ.3,200 కోట్లతో ప్రణాళిక సిద్ధం
- కొత్తగా 1.16 లక్షల ఆయకట్టుకు నీరు
- సీడబ్ల్యూసీ పరిశీలనలో సవరించిన డీపీఆర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గతానికి భిన్నంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర కేబినెట్‌లో ముగ్గురికి చోటు దక్కింది. జిల్లా సమస్యలపై ఈ ముగ్గురు మంత్రులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టులో ఇల్లెందుకు స్థానం కల్పించే అంశంపై ఫోకస్ చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

మారిన ప్రణాళిక..

సీతారామ ప్రాజెక్టుకు అప్పటి సీఎం కేసీఆర్ ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లి మండలం రోళ్లపాడులో శంకుస్థాపన చేశారు. కానీ ఆ తర్వాత కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాక్‌లు, రిజర్వ్ ఫారెస్ట్ తదితర కారణాలతో ప్రాజెక్టు ప్లానింగ్, డిజైన్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో ఇల్లెందు నియోజకవర్గం మొత్తానికే కాకుండా కొత్తగూడెం నియోజకవర్గంలోని మెజారిటీ ప్రాంతాలకు సీతారామ నీరందే పరిస్థితి లేకుండా పోయింది. ఈ అంశంపై అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ పలుమార్లు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఇల్లెందు నియోజకవర్గం కోసం ప్రత్యేకంగా డీపీఆర్ సిద్ధం చేశారు. పాత ప్లాన్‌ను పక్కన పెట్టి జూలూరుపాడు కాలువ నుంచి ఇల్లెందు పట్టణం సమీపంలో ఉన్న లలితాపురం చెరువు (కారేపల్లి మండలం) వరకు నీటిని తీసుకొచ్చి అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా ఇల్లెందు నియోజకవర్గానికి అందేలా డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు(డీపీఆర్)ను సాగునీటి శాఖ ఇంజనీరింగ్ విభాగం కేంద్ర జలవనరుల సంఘానికి సమర్పించింది. కొత్తగా రూపొందించిన ఈ డీపీఆర్‌కు ఆమోదం లభిస్తే తిరిగి ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి నీరు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత అందరి దృష్టి సీతమ్మసాగర్ బ్యారేజీ, ఇప్పటికే సమర్పించిన డీపీఆర్‌లో ఉన్న కెనాళ్లు, టన్నెళ్ల మీదనే ఉంది. కానీ ఇల్లెందుకు సంబంధించిన అంశాలపై ఎవరూ చర్చించడం లేదు.

రూ.3,200 కోట్ల అంచనాతో..

సీతారామ తొలిదశలో కీలకంగా ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్‌కు తిరిగి ప్రాధాన్యత దక్కింది. వివిధ దశల్లో ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు జూలూరుపాడు కెనాల్ ద్వారా ఇల్లెందు శివారులోని సింగరేణి మండలంలో ఉన్న లలితాపురం చెరువుకు వస్తాయి. ఈ చెరువు సముద్ర మట్టం నుంచి 175 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ లిఫ్ట్ ఏర్పాటు చేసి 216 అడుగుల ఎత్తులో ఉన్న రోళ్లపాడు రిజర్వాయ్‌కు మలిదశలో నీరు చేరుస్తారు. అక్కడి నుంచి రెండు గ్రావిటీ కెనాళ్ల ద్వారా టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. రోళ్లపాడు రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేసిన లిఫ్ట్ నుంచి జిల్లాలోనే అత్యంత ఎత్తులో (267 అడుగులు) ఉన్న ఇల్లెందు మండలం రొంపేడు దగ్గరకు నీటిని ఎత్తి పోస్తారు. అక్కడి నుంచి బయ్యారం చెరువు వరకు గోదావరి జలాలు తరలిస్తారు. ఈ చెరువును ఆలంబనగా చేసుకుని మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. మరోవైపు జూలూరుపాడు కెనాల్ – లలితాపురం ట్యాంక్‌లను ఆధారంగా చేసుకుని రఘునాథపాలెం, సింగరేణి, ఖమ్మం అర్బన్ మండలాల్లోని గ్రామాలకు నీరు సరఫరా చేసేలా కాల్వలు తవ్వనున్నారు. సీతారామలో ఇల్లెందుకు చోటు కల్పించేందుకు రూ.3,200 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

జిల్లా	నియోజకవర్గం	ఆయకట్టు
భద్రాద్రి కొత్తగూడెం	ఇల్లెందు	65,483
భద్రాద్రి కొత్తగూడెం	కొత్తగూడెం	500
ఖమ్మం	పాలేరు	7,299
ఖమ్మం	వైరా	25,524
ఖమ్మం	ఖమ్మం	1,336
మహబూబాబాద్	డోర్నకల్	263
మొత్తం		1.11 లక్షల ఎకరాలు

బొగ్గుట్టకే సింహభాగం

సీతారామ ప్రాజెక్టు మొదటి డీపీఆర్‌లో ఆయకట్టు 6.74 లక్షల ఎకరాలుగా ఉంది. కొత్తగా ఇల్లెందు కాల్వను ప్రతిపాదించడంతో ఆయకట్టు సామర్థ్యం 7.84 లక్షల ఎకరాలకు చేరుకుంది. మొత్తం మూడు జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఆయకట్టు విస్తరించి ఉంది. ఇందులో గరిష్టంగా ఖమ్మం జిల్లాలో 48 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఆ తర్వాత స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 42 వేల ఎకరాలతో ఉంది. మూడు జిల్లాల్లో విస్తరించిన ఇల్లెందు నియోజకవర్గం పరిధిలో 65 వేల ఎకరాలు ఉండగా 25 వేల ఎకరాల ఆయకట్టుతో వైరా రెండో స్థానంలో ఉంది. అతి తక్కువగా డోర్నకల్ నియోజకవర్గంలో 263 ఎకరాలు, కొత్తగూడెం పరిధిలో 500 ఎకరాలు ఉన్నాయి.

ఆనంద ద్వీపాన్ని అభివృద్ధి చేయండి



అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెంలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ



పాల్వంచ మండలం కిన్నెరసానిలో షాప్‌ను ప్రారంభిస్తున్న సువర్ణ

- అధికారులకు పీసీసీఎఫ్ ఆదేశం
- కిన్నెరసానిని సందర్శించిన సువర్ణ
- అన్నపురెడ్డిపల్లిలో ప్లాంటేషన్ పరిశీలన

పాల్వంచరూరల్/అన్నపురెడ్డిపల్లి : కిన్నెరసాని జలాశయం మధ్యలో ఉన్న ఆనంద ద్వీపాన్ని త్వరితగతిన అభివృద్ధి చేయాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) డాక్టర్ సి.సువర్ణ అటవీ అధికారులను ఆదేశించారు. పాల్వంచ మండలం ఉల్వనూరు, మొండికట్ట, అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం, మర్రిగూడెం అటవీ ప్రాంతాలలో కంపా నిధులతో వేసిన ప్లాంటేషన్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్లాంటేషన్‌లోని మొక్కల పెంపకం, చెక్‌డ్యాంలలో నీటి నిల్వ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంపా నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటుచేసిన కిన్నెరసాని గుర్తింపుచిహ్నాంతో విక్రయించే వస్తువుల దుకాణాన్ని ప్రారంభించారు. పర్యావరణ కేంద్రంలోని జంతువులకు సంబంధించిన బొమ్మలను, డీర్‌పార్కులోని దుప్పులను, నిర్మాణంలో ఉన్న రేంజర్ క్వార్టర్లను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, బోటులో వెళ్లి రిజర్వాయర్ మధ్యలో ఉన్న ఆనంద ద్వీపాన్ని సందర్శించారు. కిన్నెరసానికి వచ్చే సందర్శకులను ఆకట్టుకునేలా ఆనంద ద్వీపంలో ఎకో డెవలప్‌మెంట్ పనులు చేపట్టాలన్నారు. కాటేజీ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత కొత్తగూడెం వనవిహార్‌లో అటవీ శాఖ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ కృష్ణగౌడ్, ఎఫ్‌డీఓలు కట్టా దామోదర్‌రెడ్డి, కోటేశ్వరరావు, యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావు, ఎఫ్ఎస్ఓ హారిక, ఎఫ్ఆర్ఓ ఉమ, డిప్యూటీ రేంజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండాలి

నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ

కొత్తగూడెంటౌన్: బాధితులకు న్యాయం అందించడంతో పాటు ప్రజలకు ఎప్పుడూ అండగా నిలవాలని, వారికి పోలీసులపై నమ్మకం కలిగించాలని ఎస్పీ బి.రోహిత్‌రాజ్ అన్నారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన పరిశోధన ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని, బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. పెట్రోలింగ్, బ్లూకోట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న హాట్‌స్పాట్‌లను గుర్తించి గంజాయి రవాణా చేసేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చోరీ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి దొంగలను పట్టుకోవాలని, సొత్తు రికవరీ చేసి బాధితులకు అందజేయాలని చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేలా షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, వెంకటేష్, రాఘవేంద్రరావు, రమణమూర్తి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

- 80 సీట్ల కోసం 3,140 మంది విద్యార్థులు పోటీ
- ఉమ్మడి జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలు

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు శనివారం పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. కాగా, ఆరో తరగతిలో 80 సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయగా ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా 3,140 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరి కోసం 19 కేంద్రాలు ఏర్పాటుచేసి, పరీక్ష పకడ్బందీగా జరిగేలా ఇన్విజిలేటర్లు, స్క్వాడ్‌ను నియమించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆధార్ తప్పనిసరి

నిర్దేశిత కేంద్రాల్లో శనివారం ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష జరగనుంది. అయితే, విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. అలాగే, హాల్‌టికెట్లతో పాటు ఆధార్‌కార్డు లేదా నివాస ధ్రువీకరణ పత్రం తప్పక తీసుకురావాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాలివే...

ఖమ్మంలోని గాంధీనగర్, రిక్కాబజార్, ఎన్నెస్పీ కాలనీ, రాజేంద్రనగర్, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మౌంట్‌ఫోర్ట్ ఉన్నత పాఠశాల, మధిరలోని టీవీఎం ఉన్నత పాఠశాల, సత్తుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని చుంచుపల్లి, బాబు క్యాంపు, సింగరేణి ఉన్నత పాఠశాలలు, బూర్గంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అశ్వారావుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇల్లెందులోని సింగరేణి, జేబీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలే కాక ములుగు జిల్లా వెంకటాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్రం ఏర్పాటుచేశామని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఇందులో కొన్నిచోట్ల ఒకే ఆవరణలో రెండేసి పాఠశాలలు ఉన్నాయని తెలిపారు.

అధ్యక్ష పదవికి 13 మంది పోటీ

ముగిసిన సీఎంఓఏఐ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 28న జరుగనున్న కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి బ్రాంచ్(సీఎంవోఏఐ) ఎన్నికల్లో అధ్యక్ష పదవికి మొత్తం 13 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఉపాధ్యక్ష పదవికి 14 మంది, ప్రధాన కార్యదర్శి పదవికి ఆరుగురు, సంయుక్త కార్యదర్శి పదవికి 15 మంది, కోశాధికారి పదవికి నలుగురు, సంయుక్త కోశాధికారి పదవికి ఐదుగురు నామినేషన్లు వేశారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గడిపెల్లి కృష్ణప్రసాద్ మరోమారు బరిలో నిలిచారు. తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించానని, పీఆర్పీ ఇప్పించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 10లక్షలు వడ్డీలేని రుణం ఇప్పించానని చెబుతున్నారు.

5న ‘అవిశ్వాస’ సమావేశం

- నోటిఫికేషన్ జారీ చేసిన కలెక్టర్
- నెగ్గేనా.. వీడేనా అనే సందేహాలు





ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం (ఇన్‌సెట్) కమిషనర్ నుంచి నోటీసు అందుకుంటున్న కౌన్సిలర్ చెరుపల్లి శ్రీనివాస్

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాస నోటీసు జారీ అయింది. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నవీన్‌కు కలెక్టర్ ప్రియాంక ఆల నుంచి జారీ అయిన నోటీసును ఆయన కౌన్సిలర్లకు అందజేశారు. మున్సిపాలిటీలోని 19 మంది కౌన్సిలర్లు తమ సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానాన్ని ఈనెల 11న కలెక్టర్‌కు అందజేశారు. వారి ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ ఫిబ్రవరి 5న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, అవిశ్వాసం ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి 19 మంది కౌన్సిలర్లు హాజరై తమ అభిప్రాయం తెలియజేయాలని నోటీసులో సూచించారు.

కొంతకాలంగా ఇదే చర్చ..

ఇల్లెందు మున్సిపాలిటీలో కొంత కాలంగా చైర్మన్ డీవీపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన చర్చ జరుగుతోంది. మున్సిపల్ చట్టం ప్రకారం నాలుగేళ్లు గడిచిన తర్వాతే అవిశ్వాసానికి ఆమోదం ఉండటంతో అందుకు తగిన ఫార్మాట్‌లో 19 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన తీర్మానాన్ని ఈనెల 11న కలెక్టర్‌కు అందించారు. పరిశీలించిన ప్రియాంక ఆల.. అన్నీ సక్రమంగానే ఉండడంతో అవిశ్వాస నోటీస్ జారీ చేశారు. అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన కౌన్సిలర్లలో వాంకుడోత తార, చీమల సుజిత, సందా బిందు, తోట లలితా శారద, కడకంచి పద్మ, పాబోలు స్వాతి, సామల మాధవి, కటకం పద్మావతి, సిలివేరు అనిత, కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజమ్, కొండపల్లి సరిత, యలమందల వీణ, చెరుపల్లి శ్రీనివాస్, గిన్నారపు రజిత, సయ్యద్ జానీపాషా, మడత రమ, రేళ్ల నాగలక్ష్మి, కుమ్మరి రవీందర్ ఉన్నారు.

మున్సిపాలిటీలో బలాబలాలిలా..

ఇల్లెందు మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చైర్మన్ డీవీతో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. సీపీఐ, ఎన్డీ నుంచి ఒక్కో సభ్యుడు, బీఆర్ఎస్ నుంచి 17 మంది ఉన్నారు. వీరిలో కూడా కొంతమంది నేడో, రేపో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. ఇదే జరిగితే అవిశ్వాసం వీగిపోతుందని భావిస్తున్నారు. 2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పుడు 24 వార్డుల్లో ఆనాటి టీఆర్ఎస్ 19 స్థానాలు గెలుచుకుంది. ఎన్డీ, సీపీఐ నుంచి ఒక్కొక్కరు, టీఆర్ఎస్ రెబల్స్ ముగ్గురు గెలుపొందారు. అయితే కౌంటింగ్ కేంద్రం వద్దే ఇద్దరు సభ్యులు అధికార టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో టీఆర్ఎస్ బలం 21కి పెరిగింది. ఇక సీపీఐ, ఎన్డీ, రెబల్ నుంచి ఒక్కొక్కరితో సాగుతున్న మున్సిపల్ పాలకవర్గంలో క్రమంగా అధికార పక్షంలోనే ప్రతిపక్ష కౌన్సిలర్లుగా ఒక వర్గం ఏర్పడింది. క్రమంగా ఆ వర్గం బలం 17కు చేరింది. ఇక రెబల్, సీపీఐ, ఎన్డీ సభ్యులు కూడా అవిశ్వాసం నోటీస్‌పై సంతకం చేశారు. కేవలం ఐదుగురు సభ్యులు మాత్రం నోటీస్‌పై సంతకాలు చేయలేదు. కానీ ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొందరు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉండడంతో డీవీపై అవిశ్వాసం నెగ్గకపోవచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్ : పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. శుక్రవారం ఆయన ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల నోడల్ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 20వ తేదీన తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల షెడ్యూల్ గురించి తెలియజేయాలని సూచించారు. ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండల, జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలతో పాటు కేజీబీవీ, పట్టణ గురుకుల పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాలని వివరించారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయాలని, 22న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించాలని, 24న ఉదయం 10 గంటలకు తుది ఓటర్ల జాబితా ప్రతి పాఠశాలలో నోటీస్‌బోర్డుపై ఉంచాలని చెప్పారు. ఈ నెల 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఎన్నికలు నిర్వహించి ఆ తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకోవాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు మొదటి సమావేశం నిర్వహించాలని సూచించారు. ఎంఈఓలు, నోడల్ అధికారులు ఎన్నికల ప్రక్రియను పరిశీలించి సజావుగా సాగేలా చూడాలన్నారు. షెడ్యూల్ ప్రకారం జరిగే కార్యక్రమాల నివేదికలను ఎప్పటికప్పుడు విద్యాశాఖకు పంపాలని ఎంఈఓలను ఆదేశించారు. ఎన్నికైన సభ్యుల వివరాలను 29న సాయంత్రం 5 గంటలకు అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఎస్‌కే.సైదులు, రిసోర్స్ పర్సన్లు సాయి కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో క్రీడా పోటీలు

ప్రారంభించిన జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: ఈనెల 26 గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జిల్లా కోర్టులో క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా, జడ్జి పాటిల్ వసంత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలతో మానసిక ఉల్లాసంతో పాటు ఉత్సాహం కలుగుతాయని అన్నారు. నిత్యం కేసులు, వాదనలతో గడిపే న్యాయవాదులు, ఉద్యోగులు, గుమస్తాలు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. న్యాయవాదులు, ఉద్యోగులకు వీల్‌చైర్, క్యారమ్స్‌తో పాటు పలు రకాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, ఉపాధ్యక్షుడు దుంద్ర రమేష్, ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, పిట్టల రామారావు, యసా యుగంధర్ ,మనోరమ, కాసాని రమేష్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జడ్జి పాటిల్‌వసంత్

క్లుప్తంగా

సర్పంచ్ చెక్ పవర్ నిలుపుదల

దమ్మపేట: గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కారణంగా దమ్మపేట సర్పంచ్ ఉయ్యాల చినవెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ దారా యుగంధర్‌ల చెక్ పవర్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దమ్మపేట మేజర్ గ్రామ పంచాయతీలో 2019–20, 2020–21 సంవత్సరాలకు సంబంధించి సర్పంచ్, ఉపసర్పంచ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, పాలకవర్గ సభ్యులు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన ఉన్నతాధికారులు రూ.5,49,750 దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఆ సొమ్మును సర్పంచ్, ఉపసర్పంచ్‌ల నుంచి రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం రికవరీ చేయాలని, వారి చెక్ పవర్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

వాహన యజమానులతో 'సింగరేణి' చర్చలు



వాహన యజమానుల సమస్యలు వింటున్న సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కన్వీయెన్స్ వాహనాల నిర్వాహకులతో శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో అధికారులు చర్చలు జరిపారు. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఈ నెల 13న గోదావరిఖని, శ్రీరాంపూర్ ఏరియాల్లో పర్యటించగా, వాహనాల యజమానులు సమస్యలు విన్నవించారు. సీఎండీ సూచనల మేరకు జీఎంలు వాహన యజమానులు, డ్రైవర్ల సమస్యలపై చర్చించారు. త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశానికి హాజరైన సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనకమ్మ సీఎంపీఎఫ్, పెన్షన్ విధానం అమలుపై సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంలు జక్కం రమేష్, ఎం.జగన్మోహన్‌రావు, బి.హనుమంతరావు, ఇతర అధికారులు అజయ్‌కుమార్, వరప్రసాద్, బీడీవీ ప్రసాద్, శ్రీహరి, లక్ష్మీనారాయణ, రామశేషయ్య,ఎల్.తిరుపతి, ఎస్ఈ వి.మురళి, రాజేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు శేషయ్య, సింగరేణి భూ నిర్వాసిత అద్దె వాహనదారులు, డ్రైవర్లు, పాల్గొన్నారు.

25 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ఖమ్మంస్పోర్ట్స్: రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 25 నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి రాజీవ్ గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఎండీ మతిన్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే టోర్నీలో ఉమ్మడి జిల్లాలోని జట్లు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న జట్లు ఎంట్రీలను 93466 24241 నంబర్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

సెల్‌ఫోన్ల చోరీ

పాల్వంచ: మొబైల్ షాపు గోడకు కన్నం వేసి దొంగలు సెల్‌ఫోన్‌లు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని రాజీవ్ గాంధీ మార్కెట్ రోడ్‌లో ఉన్న తన మొబైల్ షాపు వెనుక గోడకు గురువారం రాత్రి కన్నం వేసి లోపలికి ప్రవేశించారు. షాపులో రిపేర్ కోసం వచ్చిన సుమారు 30 సెల్ ఫోన్లను చోరీ చేశారు. షాపు నిర్వాహకుడు వినయ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఆర్టీసీ కండక్టర్ బ్యాగ్‌లో నగదు మాయం

పాల్వంచ: ఆర్టీసీ బస్సు కండక్టర్ బ్యాగ్‌లో నగదు మాయమైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి మణుగూరుకు వెళుతున్న మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో కండక్టర్ క్యాష్ బ్యాగ్‌లో ఉన్న రూ.9 వేల నగదు మాయమైంది. కొత్తగూడెం క్రాస్ రోడ్ నుంచి పాల్వంచకు వస్తున్న క్రమంలో కండక్టర్ బ్యాగ్ సరిచూసుకోగా, నగదు చోరీ అయినట్లు గుర్తించాడు. పాల్వంచ బస్టాండ్‌లో బస్సును ఆపి పోలీసులకు సమాచారం అందించగా, వారొచ్చి ప్రయాణికుల్లోని కొందరు అనుమానితులను చెక్ చేశారు. నగదు దొరకక పోవడంతో సుమారు గంటన్నర తర్వాత బస్సును పంపించారు. ఈ విషయమై ఎస్‌ఐ బి.రామును వివరణ కోరగా.. తమకు సమాచారం ఇవ్వగా బస్సులో పరిశీలించి పంపించామని, తమకు లిఖిత పూర్వక ఫిర్యాదు రాలేదని తెలిపారు.

గడ్డివాము దగ్ధం

పాల్వంచ: వరిగడ్డి వాముకు నిప్పు అంటుకుని దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని వికలాంగుల కాలనీ సమీపంలో ఖాళీ స్థలంలో ముప్పాళ్ల వెంకటేశ్వరరావు వరిగడ్డి వామును ఏర్పాటు చేశారు. గడ్డివాముకు నిప్పు అంటుకుని మంటలు రావడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ గుండా పుల్లయ్య ఫైరింజన్‌తో ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధం కాగా, సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

ఆర్భాటంగా ప్రారంభించారు.. అంతటితో వదిలేశారు

- తెరుచుకోని కొత్త సబ్ డివిజన్ కార్యాలయాలు
- పంచాయతీరాజ్‌శాఖ పునర్ వ్యవస్థీకరణ చేపట్టిన గత ప్రభుత్వం
- జిల్లాలో కొత్తగా మూడు డివిజన్లు మంజూరు
- ఉద్యోగులను నియమించక ప్రారంభంకాని పాలనవ్యవహారాలు



పాల్వంచ పాత ఆర్డీఓ కార్యాలయంలో మూతబడి ఉన్న పీఆర్ కొత్త సబ్‌డివిజన్ ఆఫీస్

పాల్వంచరూరల్: నాలుగు నెలల క్రితం ఆర్భాటంగా ప్రారంభించిన పంచాయతీరాజ్ శాఖ సబ్‌డివిజన్ కార్యాలయాలు నేటికీ తెరుచుకోవడంలేదు. వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తారా? పాత కార్యాలయాల ద్వారానే పాలన కొనసాగిస్తారా అనే విషయంపై స్పష్టత లేదు. ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీరాజ్‌శాఖ పునర్‌వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో కొత్తగూడెం, భద్రాచలం డివిజన్లు ఉండగా, వీటి పరిధిలో ఐదు సబ్ డివిజన్లు ఉన్నాయి. కొత్తగా పాల్వంచ, మణుగూరు, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. డివిజన్ల పరిధిలో మండలాల విస్తీర్ణం అధికంగా ఉండటంతో కొత్త సబ్ డివిజన్లను ఏర్పాటు చేశారు. పాతవి ఐదు, కొత్తవి మూడు కలిపి జిల్లాలో ప్రస్తుతం 8 సబ్ డివిజన్లు ఉన్నాయి.

నాలుగు నెలల క్రితమే కార్యాలయాలు ప్రారంభం

కొత్తగూడెం పంచాయతీరాజ్ శాఖ డివిజన్ పరిధిలో అశ్వారావుపేట, ములకలపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం సబ్ డివిజన్లు ఉండగా కొత్తగా పాల్వంచ సబ్ డివిజన్‌తో పాటు క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ మంజూరైంది. పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాలను కలిపి సబ్‌డివిజన్ ఏర్పాటు చేసి, పాల్వంచలోని పాత ఆర్డీఓ కార్యాలయంలోని భవనంలో గతేడాది సెప్టెంబర్‌లో కార్యాలయాలను ప్రారంభించారు. భద్రాచలం డివిజన్ పరిధిలో బూర్గంపాడు, మణుగూరు రెండు సబ్ డివిజన్లు, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ ఉంది. ఈ డివిజన్‌లో కూడా మణుగూరు–2 సబ్ డివిజన్ మంజూరైంది. ఈ సబ్ డివిజన్‌ను మణుగూరు, పినపాక పరిధిలో ఏర్పాటు చేశారు.

భర్తీకాని పోస్టులు

పంచాయతీరాజ్‌శాఖలో జిల్లాలో మూడు సబ్ డివిజన్లు మంజూరు కావడంతో పరిపాలన కోసం పోస్టులు పెరగనున్నాయి. కొత్తగా మంజూరైన సబ్ డివిజన్ కార్యాలయంలో ఒక డీఈ, ఇద్దరు లేక ముగ్గురు ఏఈలతోపాటు సీనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. సబ్ డివిజన్ ఆఫీసుల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల నియామకం జరిగితే తప్ప కార్యాలయాలు పునర్ ప్రారంభంకాని సంకట పరిస్థితి ఏర్పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త పీఆర్ సబ్ డివిజన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ ప్రభుత్వం మారి కాంగ్రెస్ సర్కారు కొలువుదీరింది. కొత్త ప్రభుత్వమైనా నియామకాలపై దృష్టి సారించాల్సి ఉంది.

స్టాఫ్‌ను నియమిస్తేనే..

పంచాయతీరాజ్‌శాఖ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం మూడు సబ్ డివిజన్లు మంజూరు చేసింది. కొత్తగూడెం డివిజన్ పరిధిలో పాల్వంచ సబ్ డివిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ మంజూరయ్యాయి. క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాన్ని కొత్తగూడెంలో, పాల్వంచ సబ్ డివిజన్ కార్యాలయాన్ని పాత ఆర్డీఓ కార్యాలయంలోని భవనంలో ఏర్పాటు చేశాం. భద్రాచలం డివిజన్ పరిధిలో మణుగూరు–2 సబ్ డివిజన్ మంజూరైంది. గతేడాది సెప్టెంబర్‌లో కార్యాలయాలను ప్రారంభించాం. కానీ ఉద్యోగులను ఇంకా నియమించలేదు. పోస్టులను భర్తీ చేసిన వెంటనే సబ్‌డివిజన్ కార్యాలయాల్లో పాలన వ్యవహారాలు సాగుతాయి.

– ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ

మావోయిస్టు సానుభూతిపరులు అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఇల్లెందు: ఏడుగురు మావోయిస్టు సానుభూతిపరులను ఇల్లెందు పోలీసులు అరెస్టు చేశారు. భారీగా మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో సీఐ టి.కరుణాకర్ వివరాలు వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. ఇల్లెందు 21 పిట్ ఏరియాకు చెందిన జాడిపేట రమేష్, కారేపల్లి మండలం విశ్వనాథపల్లికి చెందిన బోడిశ నరసింహ్మ, మహబూబాబాద్‌కు చెందిన యాకుబ్‌పాషా, ముదిగొండకు చెందిన ఆలకుంట వెంకన్న కొంతకాలంగా చింతూరు, ఒడిశా వైపు కాంట్రాక్టర్ వద్ద పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన మావోయిస్టు సానుభూతిపరులు సున్నం కన్నా, సున్నం గంగా, మడకం లచ్చాలతో పరిచయం ఏర్పడింది. మావోయిస్టులకు మందుగుండు సామగ్రి అందజేస్తే తగిన సహాయం అందిస్తామని చెప్పారు. దీంతో వివిధ ప్రాంతాలు, కంప్రెషర్ మిషన్ల నుంచి సేకరించిన మందుగుండును ఇల్లెందు బస్టాండ్‌లో ఒడిశా వ్యక్తులకు అందజేస్తుండగా ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. 400 జిలిటెన్ స్టిక్స్, 1000 డిటోనేటర్లు, 3 బెడిల్స్ కేబుల్, 25 సేఫ్టీ ఫ్యూజ్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ ఘటన ఇల్లెందు ప్రాంతంలో సంచలనంగా మారింది. ఎస్‌ఐ అప్పారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌డ్యాం ధ్వంసం

చెక్ డ్యామ్‌ను పగులగొట్టడంతో వృథాగా పోతున్న నీరు



ములకలపల్లి : ములకలపల్లి శివారులో పాములేరు వాగుపై ఉన్న చెక్ డ్యామ్‌ను ధ్వంసం చేశారు. 2021 సంవత్సరంలో రూ.1.45 కోట్ల వ్యయంతో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చెక్‌డ్యాం నిర్మించారు. దీంతో కొంతమేర నీరు నిల్వ ఉంటోంది. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు చెక్ డ్యామ్‌ను రెండు మీటర్ల మేర పగులకొట్టగా, నీరంతా వృథాగా పోతోంది. ఇరిగేషన్ ఏఈ గఫూర్‌పాషా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజమౌళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చెక్ డ్యాం ఎగువన శిథిలమైన బ్రిడ్జి స్థానంలో రూ.4.5 కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు.

బాల్యస్నేహం.. చోరీల బంధం

- కొనసాగుతున్న జువైనల్ హోం నాటి స్నేహం
- ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు...
- అరెస్ట్ చేసిన సీసీఎస్, సత్తుపల్లి పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం క్రైం: చిన్నతనంలోనే వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఆ ముగ్గురు చోరీలకు పాల్పడగా.. అదుపులోకి తీసుకున్న పోలీసులు జువైనల్ హోంలో చేర్చారు. అక్కడ బుద్ధి మార్చుకుని బయటకు వచ్చాక మంచిగా గడపాల్సి ఉన్నా అలా జరగలేదు. అప్పటి స్నేహాన్నే కాదు చోరీలను కూడా కొనసాగించేందుకు ముఠాగా ఏర్పడ్డారు. తెలంగాణతో పాటు ఏపీలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఆ ముఠాను ఎట్టకేలకు ఖమ్మం సీసీఎస్, సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రూ.22 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఖమ్మంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం వెల్లడించారు.

మూడు జిల్లాలు.. ఒకే ముఠా

మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన భీమిలి రాజ్‌కుమార్, సత్తుపల్లి రాంనగర్‌కు చెందిన నీలాల అనిల్‌కుమార్, హైదరాబాద్‌లోని మెహదీపట్నంకు చెందిన మచ్చా ఆదర్శ్ ముఠాగా ఏర్పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఏలూరుతో పాటు తెలంగాణలోని వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాలో చోరీలకు పాల్పడ్డారు. ఇదే క్రమంలో సత్తుపల్లి మండలం గంగారంలోని బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ కోరం లక్ష్మణ్‌రావు బేతుపల్లిలో నివాసముంటుండగా, గత నెల 19న తాళం పగులగొట్టి రూ.4.15 లక్షల విలువైన ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు చోరీ చేశారు.

రంగంలోకి సీసీఎస్, సత్తుపల్లి పోలీసులు

హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో జరిగిన చోరీపై సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో రంగంలోకి దిగిన సత్తుపల్లి, ఖమ్మం సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చోరీ జరిగిన ఇంటి చుట్టుపక్కల ఇళ్లలోని సీసీ ఫుటేజీలు పరిశీలించగా నిందితులను పాతనేరస్తులుగా గుర్తించారు. దీంతో ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. అయితే, బేతుపల్లి చోరీతో పాటు మొత్తం 15 కేసుల్లో వీరు నిందితులని తేలింది.

పగలు గుర్తింపు.. రాత్రి చోరీ

రాజ్‌కుమార్, అనిల్‌కుమార్, ఆదర్శ్ బాలనేరస్తులు కావడంతో జువైనల్‌హోంలో ఉన్నప్పుడు పరిచయం ఏర్పడింది. అయితే, పెద్దయ్యాక కూడా మార్పు రాకపోగా అనిల్ నేతృత్వాన ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముగ్గురు పగటి పూట వీధుల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి చోరీలకు పాల్పడేవారు. ఒకవేళ తాళం పగలగొట్టడం సాధ్యం కాకపోతే బయట పార్కింగ్ చేసిన వాహనాలను ఎత్తుకెళ్లి అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. వీరి నుంచి సత్తుపల్లి రాంనగర్‌కు చెందిన తోట నరేశ్ చోరీ సొత్తు కొనుగోలు చేసినట్లు తేలడంతో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఏసీపీ రవికుమార్, సత్తుపల్లి, సీసీఎస్ సీఐలు మోహన్‌బాబు, బాలాజీ, బాలకృష్ణ ఉద్యోగులు గజేంద్ర, మంగత్యా, శ్రీనివాస్, సుధాకర్‌ను సీపీ సునీల్‌దత్ అభినందించారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి



అనూష (ఫైల్)

దుమ్ముగూడెం : మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని మట్టా అనూష (18) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. అనూష దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇరవై రోజుల క్రితం తల్లిదండ్రులకు సహాయంగా పత్తి తీసే పనులకు వెళ్లగా, ప్రమాదవశాత్తు జారి కింద పడింది. అప్పటి నుంచి ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. దాతల సహాయంతో హైదరాబాద్‌లో చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం శస్త్ర చికిత్స అనంతరం పరిస్థితి విషమించి మృతిచెందింది. దీంతో గౌరారం గ్రామంతోపాటు ప్రభుత్వ కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువకుడు..

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామపంచాయతీ బొంబాయితండా గ్రామానికి చెందిన గుగులోత్ పవన్ (22) ఈ నెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లగా, కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమరారం ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. కాగా పవన్ మృతికి కారణాలు తెలియరాలేదు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

చంద్రుగొండ : వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... మండలంలోని సీతాయిగూడెం గ్రామానికి చెందిన పిట్టల సాంబయ్యకు ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వైఎస్సార్ బంజర్‌కు చెందిన శివరాణి(27)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలంలో శివరాణి కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం కడుపునొప్పి తీవ్రత పెరగడంతో భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మాచినేని రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థి...



సూర్యప్రకాష్ (ఫైల్)

చంద్రుగొండ : పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించగా మనస్తాపం చెంది ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రావికంపాడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. రావికంపాడు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ తలారి ముత్తయ్య, కవిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సూర్యప్రకాష్ (15) ఖమ్మం జిల్లా పెనుబల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో పదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులకు ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడంతో పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించారు. స్కూల్‌కు వెళ్లడం ఇష్టంలేని సూర్యప్రకాష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన ఇరుగుపొరుగువారు బాలుడ్ని చికిత్స నిమిత్తం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మాచినేని రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో బీటెక్ విద్యార్థి అద్దంకి విజయ్‌కుమార్ (25) మృతి చెందాడు. రఘునాథపాలెం ఎస్‌ఐ కొండల్‌రావు కథనం ప్రకారం.. కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన విజయ్‌కుమార్ గురువారం సాయంత్రం తన సోదరిని ద్విచక్ర వాహనంపై ఖమ్మం తీసుకెళ్లి హైదరాబాద్ బస్సు ఎక్కించాడు. ఆ తర్వాత స్వగ్రామానికి వెళ్తుండగా రఘునాథపాలెం మండలం మంచుకొండ వద్ద ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డులో ఎదురుగా వచ్చిన ట్రాలీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయ్‌కుమార్‌ను 108లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు విజయ్ తండ్రి వెంకటాచారి ఫిర్యాదుతో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

మట్టి టిప్పర్ సీజ్

పాల్వంచ: పట్టణంలోని రాతి చెరువు బంజర సమీపంలోని ఓ హాస్టల్‌కు అక్రమంగా తోగ్గూడెం నుంచి మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తుండగా శుక్రవారం రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. వాహనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని, శనివారం జరిమానా వేస్తామని ఆర్‌ఐ రవికుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం

కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని, తెల్లం



ఉత్తర్వుల ప్రతులను అందజేస్తున్న ఎమ్మెల్యేలు, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): చిన్నారుల ఆలనాపాలనలో అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయమని కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు తెల్లం వెంకట్రావు అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చిన ఉత్తర్వుల ప్రతులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు మూడేళ్ల నుంచే అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తారని, వారికి బాల్యం నుంచే సంస్కారం నేర్పే బాధ్యతను అంగన్‌వాడీ సిబ్బంది తీసుకుంటారని వివరించారు. జిల్లాలోని 626 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తుండగా, మారుమూల గ్రామాల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, మహిళా సంక్షేమాధికారి వేల్పుల విజేత, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

30 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్.

జూలూరుపాడు: ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్ట్ పరిధిలోని జూలూరుపాడు మండలంలో 30 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సీడీపీఓ సీహెచ్ నిర్మలాజ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. గతంలో 37 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, అప్‌గ్రేడేషన్‌తో వాటి సంఖ్య 67కు చేరిందని పేర్కొన్నారు. మినీ కేంద్రాలు అప్‌గ్రేడ్ కావడంతో ఆయా కేంద్రాల టీచర్ల వేతనం రూ.7,800 నుంచి రూ.13,760కు పెరగుతుందని తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక ఆల, ఎమ్మెల్యేల చేతులు మీదుగా ఉత్తర్వులు కాపీలు అందుకున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి, శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

డీఎంఎస్ ఉమేష్ ఎం.సావర్కర్



మాట్లాడుతున్న డీఎంఎస్ ఉమేష్ సావర్కర్

మణుగూరు రూరల్ : సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్య సాధనలో రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతీ ఒక్కరు రక్షణ సూత్రాలు పాటించాలని డీఎంఎస్ ఉమేష్ ఎం.సావర్కర్ పేర్కొన్నారు. సింగరేణి మణుగూరు ఏరియాలోని జీఎం కార్యాలయంలో శుక్రవారం 17వ ఏరియా లెవల్ త్రైపాక్షిక రక్షణ సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డీఎంఎస్‌లు ఉమేష్, ఎస్‌జీ బాయిసరె, ఇతర ఉన్నాధికారులు డాక్టర్ జార్జ్ జాన్, గౌరవ్ లడ్డా, కమలేష్ కుమార్‌వర్మ తదితరులు హాజరయ్యారు. సింగరేణి నుంచి సేఫ్టీ జీఎంలు కె.గురవయ్య, కె.కుమారస్వామి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్ హాజరయ్యారు. రక్షణకు సంబంధించిన పలు అంశాలు, సమస్యలపై చర్చించారు. తొలుత రక్షణ ప్రతిజ్ఞ చేసి చేయించారు. ఏరియాలో అమలు పరుస్తున్న రక్షణ చర్యలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అధికారులు వెంకటరమణ, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, టి.లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, వీరభద్రరావు, వెంకటరావు, ఎస్.రమేష్, మేరికుమారి, మదన్ నాయక్, రాంబాబు, వీరభద్రుడు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి



కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న కమాండెంట్ మనీష్ కుమార్ మీనా, అధికారులు

చర్ల: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ కమాండెంట్ మనీష్ కుమార్ మీనా పేర్కొన్నారు. మండలంలోని ఉంజుపల్లిలో ఉన్న సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ క్యాంపులో సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సమీప గ్రామాల మహిళలకు టైలరింగ్ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మహిళ భర్తకు చేదోడు వాదోడుగా ఉండాలని సూచించారు. మహిళలకు భరోసా కల్పించేందుకు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోని గ్రామాల్లో టైలరింగ్ శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ పీయూష్ తివారీ, అసిస్టెంట్ కమాండెంట్ వినాయక్ రంజన్, పూసుగుప్ప ఉప సర్పంచ్ సతీష్‌కుమార్, ఉంజుపల్లి, వద్దిపేట, పూసుగుప్ప, వెంకటచెరువు గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణకు మరిన్ని కేంద్ర సంస్థలు



ఇన్వెంటివ్-2024 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ఐఐటీ హైదరాబాద్‌లో ఇన్వెంటివ్-2024 ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

- వెయ్యి కోట్లతో సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశాం
- అభివృద్ధి భారత్ లక్ష్యాన్ని సాధించడానికి స్టార్టప్‌లే వెన్నెముక
- దేశాన్ని మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చాలని పిలుపు
- ఐఐటీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: డిజిటైజేషన్, డిస్టెన్స్ లెర్నింగ్ మెథడాలజీ, ఆన్‌లైన్ అప్రోచ్, డిజిటల్ నెట్ వర్కింగ్ వంటి అంశాలకు సంబంధించి తెలంగాణలో కేంద్ర సంస్థలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. తెలంగాణలో ఇటీవలే రూ.వెయ్యి కోట్లతో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రాచీన భారతం ఎన్నో ఆవిష్కరణలకు భూమికగా నిలిచిందని.. ఆధునిక భారతం విశ్వమిత్రగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. 'జై విజ్ఞాన్, జై అనుసంధాన్' నినాదంతో దేశయువత భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ లీడర్‌గా మారుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఉన్నత విద్యా సంస్థల రెండో ఎడిషన్ 'ఇన్వెంటివ్, ఆర్అండ్‌డీ ఇన్నోవేషన్ ఫెయిర్'ను ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజుల ఈ సదస్సులో ఐఐటీలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థలు కలిపి మొత్తం 53 విద్యా సంస్థల నుంచి 120 ఆవిష్కరణలను ప్రదర్శనకు పెట్టారు. హెల్త్‌కేర్, అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, క్లైమేట్ చేంజ్, ఈ–మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, డిఫెన్స్ అండ్ స్పేస్, ఇండస్ట్రీ 4.0 తదితర ఇతివృత్తాలతో వీటిని రూపొందించారు.

దేశాన్ని తయారీ కేంద్రంగా మారుస్తాం

ప్రజల రోజువారీ జీవితంలో ఉపయోగపడేలా సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఐఐటీలకు ప్రధాని మోదీ సూచించినట్టు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గుర్తు చేశారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న కల సాకారంలో స్టార్టప్ కంపెనీలు వెన్నెముకగా నిలుస్తాయని.. ఇన్వెంటివ్–2024 వంటి సమావేశాలు రోడ్ మ్యాప్‌గా ఉపయోగపడతాయని చెప్పారు. నూతన ఆవిష్కరణలు మరింత పెరిగేలా విద్యాసంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ అంతా సహకారం అందించాలని కోరారు. దేశ జీడీపీలో కనీసం 25 శాతానికి దోహదపడేలా భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడమే లక్ష్యమని వివరించారు. ఆ దిశగానే 'మేక్ ఇన్ ఇండియా, ఇన్వెస్ట్ ఇన్ ఇండియా, పీఎల్ఐ స్కీమ్, ఎఫ్‌డీఐ లిబరలైజేషన్'వంటి విధానాలను కేంద్రం తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డొమైన్‌లో 46 శాతం గ్లోబల్ డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయని, మనదేశం ఇన్నోవేషన్‌కు ఇంక్యుబేటర్‌గా మారిందని చెప్పారు. 2014లో 350 స్టార్టప్ కంపెనీలు ఉంటే.. ఇప్పుడవి లక్షా 20వేలకు చేరాయన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలు

విద్యార్థుల ఆత్మహత్యలు సమాజానికి మంచిది కాదని కేంద్ర మంత్రి అన్నారు. ఐఐటీల్లో ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాయన్నారు.

క్లుప్తంగా...

మరో రూ. రెండు వేల కోట్ల రుణం

బాండ్ల వేలం వేసి ఆర్‌బీఐ ద్వారా సర్కారు సేకరణ

సాక్షి, హైదరాబాద్: ఈ నెలలో తెలంగాణ ప్రభుత్వరుణాలు రూ.2 వేల కోట్లకు చేరనున్నాయి. రుణాల కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ద్వారా సెక్యూరిటీ బాండ్ల వేలం వేస్తోంది. ఈ మొత్తంలో రూ.వెయ్యికోట్లను ఈ నెల 16వ తేదీన తీసుకోగా, మరో రూ.వెయ్యి కోట్లను 23న సమకూర్చుకోనుంది. ఈ మేరకు ఆర్‌బీఐ షెడ్యూల్ విడుదల చేసింది. గత డిసెంబర్‌లో రూ.1,400 కోట్ల రుణాలను బహిరంగ మార్కెట్‌లో సేకరించిన ప్రభుత్వం జనవరిలో మరో రూ.రెండు వేల కోట్లను సమకూర్చుకోనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ అప్పుల పద్దు రూ.3,400 కోట్లకు చేరనుంది.

వ్యవసాయేతర రుణాలను వసూలు చేయాలి

మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: డీసీసీబీలు, ప్యాక్స్‌ల్లో వ్యవసాయేతర రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని ఎగవేతదారుల నుంచి బకాయిలను వసూలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పర్యటన సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు ప్యాక్స్ నిబంధనలకు విరుద్ధంగా రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించనివారిపై కఠినచర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్యాక్స్‌లను బలోపేతం చేయాలని కోరారు. తమది రైతు ప్రభుత్వమని, రైతుల మేలు కోరే ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

చౌటుప్పల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గుర్గిళ్ల నరేశ్(32) చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి కొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ధనుంజయ్య తెలిపారు.

పెట్టుబడుల కోసం అదానీని కలిస్తే తప్పేంటి?

- బావ బావమరిది పోటీపడి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు
- డిపాజిట్లు రావనే బీజేపీ నేతలతో మంతనాలు: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడుల కోసం, పరిశ్రమల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో పారిశ్రామికవేత్త అదానీని కలిస్తే తప్పేంటని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. దాన్ని కూడా విమర్శిస్తున్నారని, ఆ మాత్రం కామన్‌సెన్స్ కేటీఆర్‌కు లేదా అని జూపల్లి నిలదీశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్‌కి చెందిన బావ బావమరుదులు హరీశ్, కేటీఆర్ పోటీపడి కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం బీఆర్ఎస్ తెర వెనుక యత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు రావని నిర్ధారించుకున్న తర్వాతే బీఆర్ఎస్‌ను బతికించుకునేందుకు బీజేపీ నేతలతో మంతనాలు సాగిస్తున్నారని విమర్శించారు.

హరీశ్‌వి ఝూటా మాటలు

కేసీఆర్ బంగారు పళ్లెంలో పెట్టి రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టారంటూ హరీశ్ ఝూటా మాటలు మాట్లాడుతున్నారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ రూ.ఏడు లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచారని, ఆయన నిర్వాకాన్ని మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రజల ముందు బట్టబయలు చేశామన్నారు. ఇంత అప్పుల భారం ఉన్నా ప్రజల కిచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అత్యధిక స్థానాలను హస్తగతం చేసుకుంటుందన్నారు.

గల్ఫ్ ఏజెంట్ల ఇంట్లో సీఐడీ సోదాలు

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలోని ముగ్గురు గల్ఫ్ ఏజెంట్ల ఇళ్లలో సీఐడీ అధికారులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో కొన్ని పాస్‌పోర్టులు, నకిలీ ధ్రువపత్రాలు, స్టాంపులతో పాటు ఓ గల్ఫ్ ఏజెంట్ ఇంట్లో రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సోదాలు జరిగాయి. కోరుట్లకు చెందిన అశోక్‌రావు, చాంద్, ఖమర్‌లు కొన్నేళ్లుగా పాస్‌పోర్టులు ఇప్పిస్తూ గల్ఫ్ ఏజెంట్లుగా చెలామణి అవుతున్నారు. ల్యాప్‌టాప్‌లు, బ్యాంక్ అకౌంట్ బుక్‌లు, పదోతరగతి మెమోలు, బోనఫైడ్ సర్టిఫికెట్లు, స్టాంపులు, ఇతరత్రా నకిలీ ధ్రువపత్రాలు స్వాధీనం చేసుకొని ముగ్గురు ఏజెంట్లతో పాటు, ఓ ఏఎస్ఐని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించినట్టు తెలిసింది.

నకిలీ పాస్‌పోర్టు ఆధారంగా..

నెలరోజుల క్రితం జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడి ఎయిర్‌పోర్టులో అతడిది నకిలీ పాస్‌పోర్టు అని గుర్తించిన ఇమిగ్రేషన్ అధికారులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఇండియన్ ఎంబసీకి సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం మేర కు అప్రమత్తం అయిన హైదరాబాద్ పోలీసులు కేసును సీఐడీకి అప్పగించినట్టు సమాచారం. నకిలీ పాస్‌పోర్టు జారీ చేసే సమయంలో సదరు ఏఎస్ఐ జగిత్యాల స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్నాడు.

నకిలీ ధ్రువపత్రాల ఆరోపణలు

అశోక్‌రావు, చాంద్, ఖమర్‌లు పదేళ్లక్రితం పాస్‌పోర్టులు ఇప్పించే సమయంలో కంపెనీలు వీసాల కోసం జతచేసే ఈసీఎన్ఆర్ క్లియరెన్స్‌కు దరఖాస్తుదారు చదువుకోకున్నా, కొన్ని విద్యా సంస్థలకు చెందిన నకిలీ ధ్రువపత్రాలు తయారు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా నకిలీ పత్రాలతో పదోన్నతులు పొందిన కొంతమంది ఉపాధ్యాయులు సైతం రివర్షన్‌కు గురయ్యారని సమాచారం. మళ్లీ నకిలీ ధ్రువపత్రాలు తయారుచేస్తున్నారన్న సమాచారంలో సీఐడీ అధికారులు సోదాలు చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు పెంచండి

- సోలార్ విద్యుత్ వినియోగం, ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి: భట్టి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులను ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు ఇంధన పొదుపులో భాగంగా మార్కెట్లోకి వస్తున్న విద్యుత్ వాహనాలకు చార్జింగ్ అందించడానికి అన్ని ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్లు నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న సౌర, పవన, జల విద్యుత్ ఉత్పత్తి కార్యక్రమాలపై డిప్యూటీ సీఎం శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత రాకుండా సౌర విద్యుత్‌ను పెద్ద మొత్తంలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్రంలోని జలాశయాలపై సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ రూఫ్‌టాప్ సిస్టం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సంప్రదాయేతర ఇంధన విద్యుదుత్పాదనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే పరిశీలించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

ఆ రాయితీలను ప్రజలకు వివరించండి

రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచడానికి గృహ వినియోగదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. గృహ వినియోగదారులు ఒక కిలో వాట్ సౌర విద్యుత్ ఉత్పత్తి ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే..రూ. 18 వేలు రాయితీ ప్రభుత్వం ఇస్తున్న విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. మూడు కిలో వాట్స్ నుంచి పది కిలో వాట్స్ వరకు కిలో వాట్ కు రూ. 9 వేలు లెక్కన ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

బీసీల బడ్జెట్ రూ. 20 వేల కోట్లకు పెంచాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రమిచ్చిన ఎంపీ కృష్ణయ్య


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: వచ్చే బడ్జెట్‌లో బీసీల కేటాయింపులను రూ.20 వేల కోట్లకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, కోట్ల శ్రీనివాస్, టి.రాజ్‌కుమార్ శుక్రవారం సచివాలయంలో మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. బీసీల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని భట్టికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, బీసీ బంధు పథకం ప్రవేశపెట్టాలని కోరారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలని, 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో రూ.2వేల కోట్లు కేటాయించాలని విన్నవించారు. బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని కోరారు. మెస్ చార్జీలు, స్కాలర్ షిప్స్‌ను పెంచాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు.

విమానాల్లో నాణ్యమైన భోజనం ఇవ్వాలి

- క్యాటరింగ్ సంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: విమాన ప్రయాణికులకు అందజేసే ఇన్‌ఫ్లైట్ భోజనం విషయంలో కచ్చితమైన నాణ్యతాప్రమాణాలను పాటించాలని ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంబంధిత సంస్థలను ఆదేశించింది. విమానాల్లో ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందజేసే క్యాటరింగ్ సంస్థలు, ఎయిర్‌లైన్స్ సంస్థలతో ఈ నెల 16వ తేదీన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహార పదార్థాల నాణ్యత, నిబంధనల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు ఇచ్చే ఆహారం ఎంతో సురక్షితంగా, నాణ్యమైనదిగా ఉండాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. ఆహార భద్రత, ప్రమాణాల మేరకు లేబులింగ్, డిస్‌ప్లే స్పష్టంగా ఉండాలని, ఈ మేరకు 2020లో విధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్ని విమాన క్యాటరర్లు, విమానయాన సంస్థలను ఆదేశించింది. ప్రయాణ సమయంలో అందజేసే ఆహార పదార్థాల పూర్తి వివరాలు ప్రయాణికులకు ఇవ్వాలని ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆదేశించారు. దీంతో క్యాటరింగ్ సేవల్లో పారదర్శకత పెరుగుతుందన్నారు. మరోవైపు ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

జిల్లా వార్తలు

ఉత్సాహంగా కథా, కవితా కార్యశాల

- భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో నిర్వహణ
- వివిధ పాఠశాలల నుంచి హాజరైన 500 మంది విద్యార్థులు
- ప్రారంభించిన బాలోత్సవ్ జాతీయ కన్వీనర్ రమేశ్‌బాబు



కార్యశాలను ప్రారంభిస్తున్న బాలోత్సవ్ కన్వీనర్ రమేష్‌బాబు, డీఈఓ చారి తదితరులు

కొత్తగూడెంటౌన్: బాలబాలికలు భాషపై పట్టు సాధించడమే కాక.. రచనలపై ఆసక్తి కలిగేలా తర్ఫీదునిచ్చేందుకు కొత్తగూడెం క్లబ్‌లో 'బాలోత్సవ్' ఆధ్వర్యాన రెండు రోజుల పాటు జరిగే కథా, కవితా కార్యశాల శుక్రవారం ప్రారంభమైంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి పాఠశాలకు ఐదుగురి నుంచి పది మంది చొప్పున దాదాపు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. అలాగే, నల్లగొండకు చెందిన కోదాడ స్కూల్ (సోమిరెడ్డి) విద్యార్థులు సైతం వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆసక్తిగా పాల్గొనగా.. మొదటి రోజు పలువురు కవులు కవితలు, కథలు ఎలా రాయాలి, ఎలాంటి అంశాలను ఎంచుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. తెలంగాణ, ఏపీ నుంచి వచ్చిన పలువురు కవులు, రచయితలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ పలు అంశాలపై ఆసక్తి పెంపొందేలా తర్ఫీదునిచ్చారు.

భాషపై ఆసక్తి పెంపొందించేలా..

నేటి విద్యార్థులే రేపటి కవులు, కథకులు, మేధావులని బాలోత్సవ్ జాతీయ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు తెలిపారు. కొత్తగూడెంక్లబ్‌లో కథా, కవితా కార్యశాలను భద్రాద్రి జిల్లా డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలుగుభాషపై మమకారంతో పాటు రచనలపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలనే లక్ష్యంతో ఈ కార్యశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు పాల్గొని విద్యార్థులకు మెళకువలు నేర్పించడం ద్వారా సొంతంగా కథలు, కవితలను రాసేలా శిక్షణ ఇస్తారని వెల్లడించారు. డీఈఓ వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ.. సామాజిక మార్పు, పురోగతికి సాహిత్యం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ మేరకు బాలబాలికల్లో సాహిత్యంపై ఆసక్తి, అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల రచయితలు వీఆర్ తూములూరి, కిలారి స్వర్ణ, కోట్టం రామకృష్ణారెడ్డి, ఎలియా మన్నె, అనిల్ డ్యానీ, కొనూరి రవికుమార్, డాక్టర్ కటుకోజ్వల రమేశ్, భగవంతం, వెంకట్రావు, మల్సూర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.


చాలా ఆనందంగా ఉంది



చిన్నప్పటి నుంచి కథలు చదవడమంటే ఇష్టం. అందుకే కవితలు, కథలు రాయడం నేర్చుకోవాలని వచ్చా. మొదటి రోజు రచనలు ఎలా చేయాలో అవగాహన కల్పించారు. బాలోత్సవ్ కమిటీ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగపడుతుంది.

–చంద్రలేఖ, 10వ తరగతి, జెడ్పీహెచ్ఎస్ పోకలగూడెం, చండ్రుగొండ

విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుంది..



ఇలాంటి పోటీలతో పిల్లల్లో రచనలు, సాహిత్యంపై ఆసక్తి పెరుగుతుంది. రాయాలనే తపన మొదలవుతుంది. బాలోత్సవ్ ఆధ్వర్యాన బాలబాలికలకు మెళకువలు నేర్పించడం బాగుంది. పిల్లలకు భాష, సాహిత్యంపై ఆసక్తి పెంచేందుకు తోడ్పడుతుంది.

–బి.వీరన్న, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ పోకలగూడెం, చండ్రుగొండ



విద్యార్థులకు రచనల్లో మెళకువలు నేర్పిస్తున్న దృశ్యం

రామయ్య నిత్యాన్నదానానికి విరాళాలు


దాతలకు రశీదు అందజేస్తున్న ఏఈఓ

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వా మి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి పలువురు భక్తులు శుక్రవారం విరాళాలు అందజేశారు. ఏపీలోని రాజమండ్రి దానవాయిపేట కు చెందిన గుండు వెంకటసుధీర్ రూ.లక్ష, చిత్తూరు జిల్లా చింతలపట్టడైనగర్‌కు చెందిన పీడీ రఘురామన్–లోకేశ్వరి దంపతులు రూ.1,00,009ను ఆలయ అధికారులకు అందజేయగా వారు రశీదు ఇచ్చి స్వా మిదర్శనం చేయించారు. కార్యక్రమంలో ఏఈఓ భవానీరామకృష్ణ, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గగనతలంపై మినీ విమానం


కందిపాడు సమీపాన ఎగురుతున్న విమానం

చర్ల: మండలంలో గగనతలంపై శుక్రవారం మినీ విమానం చక్కర్లు కొట్టింది. మండలంలోని కొయ్యూరు, ఉప్పరిగూడెం, లెనిన్‌కాలనీ, కందిపాడు మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పామేడు ప్రాంతానికి వెళ్లిన ఈ విమానం మళ్లీ అదే మార్గంలో తిరిగి వెళ్లింది. హెలికాప్టర్ ఎగిరే ఎత్తు కంటే తక్కువ ఎత్తులో ఇది ప్రయాణించగా విమానాన్ని చూసిన ఏజెన్సీ వాసులు ఆందోళనకు గురయ్యారు. మూడు రోజుల కిందటే సరిహద్దున ఉన్న పామేడులోని పోలీసు క్యాంపులపై మావోయిస్టులు దాడికి పాల్పడగా మావోయిస్టులను గుర్తించేందుకు పోలీసులు మినీ విమానాల్లో ప్రయాణిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే, అది పైలట్లకు శిక్షణ ఇచ్చే మినీ విమానం అని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తిరుమలాయపాలెం మండలంలో..

తిరుమలాయపాలెం: ఆకాశంలో పక్షి మాదిరి కనిపిస్తూ ఓ చిన్న విమానం తక్కువ ఎత్తులో ప్రయాణించింది. తిరుమలాయపాలెం మండల కేంద్రంతో పాటు ఎదుళ్లచెరువు, రమణాతండా ప్రాంతాల మీదుగా శుక్రవారం ఉదయం ఈ విమానం వెళ్లింది. తక్కువ ఎత్తులో పొలాల మీదుగా వెళ్లిన విమానాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

అణుశక్తి విభాగాల్లో కార్మికులకు అండగా ఉంటాం..


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

అశ్వాపురం: అణుశక్తి విభాగాల్లోని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారికి అండగా నిలుస్తామని అణుశక్తి కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు గడ్డం రమేశ్ తెలిపారు. అశ్వాపురంలోని గౌతమీనగర్ కాలనీలో భారజల కర్మాగారం కార్మిక సంఘం, సైంటిఫిక్ అసిస్టెంట్స్ అండ్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన జాతీయ అణుశక్తి కార్మిక సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పతాకాన్ని రమేశ్ ఆవిష్కరించగా, ఇటీవల మరణించిన కేఎస్ ఆనంద్ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సంఖ్య తగ్గుదల, వైద్య సౌకర్యాలు మెరుగుపరచడంపై పోరాడాల్సిన అవసరముందని తెలిపారు. భారజల కర్మాగారం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూరపాటి శ్రీనివాసరావు, పోతురాజు శ్రీనివాసరావుతో పాటు గుడ్ల శ్రీనివాసరావు, పాడ్య కేశవరావు, పోగుల ప్రతాపరెడ్డి, ఊకె వెంకటేశ్వర్లు, కేవీ రావు, వేణుగోపాల్, అంజన్‌రావు, మోహన్‌బాబు, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు.. డీసీసీబీ అభివృద్ధి

- నష్టాలను అధిగమించి లాభాల్లోకి తీసుకొచ్చాం
- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం


మాట్లాడుతున్న చైర్మన్ నాగభూషణ, పక్కన సీఈఓ రెహమాన్

ఖమ్మంవ్యవసాయం: రైతులకు మేలు చేస్తూనే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)ను అభివృద్ధి పథాన నిలిపామని చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 మార్చిలో తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయాన బ్యాంకు రూ.7.23 కోట్ల నష్టాల్లో ఉండగా, నాలుగేళ్ల పాలనలో నష్టాలను అధిగమించి రూ.10.88 కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చామని వివరించారు. రూ.116.31 కోట్లుగా ఉన్న మూలధనాన్ని రూ.144.33 కోట్లకు, రూ.994.03 కోట్లుగా ఉన్న డిపాజిట్లను రూ.1,109.35 కోట్లకు చేర్చామని తెలిపారు. అలాగే, అన్నివర్గాల వారికి రుణాలు ఇస్తూ బ్యాంకు వ్యాపారాన్ని పెంచామని పేర్కొన్నారు.

సొసైటీని కూడా అభివృద్ధి చేశా..

రఘునాథపాలెం మండలం వీవీ పాలెంలోని పీఏసీఎస్ చైర్మన్‌గా సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని నాగభూషణం తెలిపారు. చైర్మన్ తాను బాధ్యతలు చేపట్టిన సమయాన పీఏసీఎస్‌లో రూ.15.12 లక్షలుగా ఉన్న డిపాజిట్లను రూ.2.85 కోట్లకు పెంచినట్లు పేర్కొన్నారు. ఎక్కడా అవినీతికి పాల్పడకుండా రైతులు, అన్నివర్గాల ప్రజలకు సేవలందించానని తెలిపారు. అయితే, ప్రభుత్వం మారడంతో కొందరు ఆ వైపునకు వెళ్లి అవకాశాలను వినియోగించుకుంటున్నారని వెల్లడించారు. నాలుగేళ్ల కాలంలో తనకు సహకరించిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ అబిద్ ఉర్ రెహమాన్ పాల్గొన్నారు.

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపాలి


రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అన్నపురెడ్డిపల్లి: అన్నదాతలు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపితే మంచి ఫలితాలు వస్తాయని ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ (ఈఈఐ) డైరెక్టర్ ఎం.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెంలో ఈఈఐ, ఎవర్‌గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ అధికారులతో కలిసి నాబార్డ్ సహకారంతో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు, శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ఆవశ్యకత, వాతావరణ సంబంధిత సమాచారం తెలుసుకునే అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు చర్చించే సదుపాయం, వ్యవసాయంలో డ్రోన్ వినియోగాన్ని వివరించారు. నాబార్డు డీడీఎం సుజీత్, ఎల్‌డీఎం రాంరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి మరియన్న, కేవీకే కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, ఏడీఏలు అఫ్జల్‌బేగం, తాతారావు, సర్పంచ్ ప్రమీలతో పాటు ఈఈఐ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.శిరీష, సీఎండీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో 23న జాబ్‌మేళా

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన ఈ నెల 23న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల గిరిజన నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా నిర్వహిస్తు న్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. నర్సింగ్ ఉద్యోగాలతో పాటు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, గిరిజన నిరుద్యోగ యువతకు వివిధ సంస్థల ద్వారా వెబ్ మొబైల్ అప్లికేషన్, బ్యూటీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సీసీటీవీ టెక్నీషియన్, టూవీలర్ మెకానిజంలో భోజన, వసతితో కూడిన ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ జిరాక్స్‌లతో ఈనెల 23న ఉదయం 9 గంటలకు భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పీఓ సూచించారు.